# "ఫ్రాయర్ బాక్స్ థీరమ్"

● గరికిపాటి సుబ్బరాయశాస్త్రి ●

★

ఆ రోజున ఆఖరు పరీక్ష. ఆనాటితో రామం బి.యే. చదువు పూర్తవుతుంది. అలవాటు ప్రకారం తెల్లవారుఝామునే లేచి, కాలకృత్యాలు తీర్చుకొని, వీధిలోని అరుగుప్రక్కనేవున్న తన గదిలో కూర్చున్నాడు. సాధారణంగా పరీక్షలలోని విద్యార్థుల గదులలోవలె, యీ గదిలో టీ ఫ్లాస్కు, కాచి గ్లాసులు, పొగలు క్రమ్మిన కిరసనాయిలు దీపము, చిందరవందరగా పారవేసిన కాగితం ముక్కలు, సిగరెట్టు పీకలు మొదలైన వేమీ లేవు. గదంతా అప్పుడే సర్దినట్లుగా వుంది. ఆవేళటి పరీక్షకు అవసరమైన రెండు మూడు జామెట్రీ పుస్తకాలు మాత్రం బల్లమీద వున్నాయి. మిగిలిన పుస్తకాలన్నీ యథాస్థానాలలో సర్దబడివున్నాయి. ఆ గదిలోని వాతావరణము, రామం నిశ్చలత, చూస్తే పరీక్షలయెడ అతనికి గల నిర్లక్ష్యభావం స్పష్టపడుతోంది. అయితే ఈ నిర్లక్ష్యభావం,-లాంఛనానికి పరీక్షకు హాజరవుతున్న కొత్త పెళ్ళికొడుకు కనబరచే నిర్లక్ష్యభావంవంటిది గాని, "ఊర్చిపోతే సెప్టెంబరు లేదా" అన్న వేదాంతంలోని నిర్లక్ష్యభావమువంటిది గాని కాదు. పరీక్షకు చదువవలసిన విషయాలన్నీ యిదివరకే క్షుణ్ణంగా చదువటము మాత్రమే కాకుండా, పరీక్షముందు చేయవలసిన పునఃపఠనము కూడా, అంతకుపూర్వమే పూర్తిచేయుటము వలన రామానికా ఘడియలో చేయదగినదేమీ కనుపించలేదు. పరీక్ష యింకొక మూడుగంటలలో ప్రారంభము కానున్న ఆ అమూల్య సమయములో రామం కనబరుస్తున్న యీ అసాధారణ నిశ్చలత, బహుశః చాలమందికే నిర్లక్ష్యముగా కనుపించవచ్చును.

రామం దృష్టి అలమారులోని పై అరమీదకు పోయింది. దానిలో అతడు వివిధ తరగతులలో పొందిన బహుమానాలన్నీ చక్కగా అమర్చివున్నాయి. అందులో కొన్ని—పరీక్షలలో ప్రథముడుగా విజయము పొందుటవలన యివ్వబడిన బహుమానములు. మరికొన్ని—ఆదర్శప్రాయమైన అతని నడవడికకు యివ్వబడిన బహుమానములు. ఈ బహుమానములలో చక్కని వెండి పాత్రలు, వెండి పతకములు మాత్రమే కాక "గాంధీ మహాత్ముని జీవిత కథ" మొదలైన అమూల్య గ్రంథములు కూడా వున్నవి. ఏనాడో రామం మూడవ తరగతి చదువుతున్నప్పుడు బడిలో ప్రదర్శించిన శివాజీ నాటకంలో శివాజీగా అభినయించినందుకు అతనికీయబడిన చక్కని శివాజీ చిత్రపటము కూడా కలదు. దానిని చూడగానే రామం మనస్సు అతని చిన్ననాటి రోజులమీదకు పోయింది.

పసితనంలోనే తండ్రి చనిపోవడంవల్ల రామానికి ఫోటోలోని తండ్రి మాత్రమే తెలుసు. రామం ఏడెనిమిదేళ్ళ వయసులో వుండగా అతని తల్లికి జ్వరం వచ్చి వారంరోజులకల్లా ఆమె కూడా రామాన్ని విడచిపెట్టిపోయింది. తల్లిదండ్రులు లేని రామాన్ని అతని మేనమామ సుబ్బన్నగారే దగ్గరకు తీసి పెద్దవాణ్ణి చేశాడు. చిన్నప్పటినుంచీ రామం చదువు పాఠశాలవారి ఉపకార వేతనములమీదనే కాలక్షేపమగుటవలన సుబ్బన్నగారికి రామాన్ని పోషించటము ఒక భారముగా అగపించలేదు. రామం కూడా మేనమామ యెడ


---

* ఆనందశా

చాలా వినయముతో వుండటమే కాకుండా, వీలు కలిగినప్పుడల్లా యేదో యింటిపని చేస్తూనే వుండే వాడు. తను బీదవాడననీ, అందువలన తనకు విద్య, వినయములే యోగ్యతలనీ గుర్తించి సాధ్యమైనంతవరకు అందరి దృష్టిలోనూ మంచివాడన్నే పేరు సంపాదించుటకు ప్రయత్నించేవాడు. ఆ నాటితో రామం చదువు పూర్తవుతుంది.

ఆలోచనల్లో మునిగిపోయిన రామానికి తన చదువు పూర్తయిందనీ, యిన్ని సంవత్సరాలూ చదివిన చదువుకు ప్రతిఫలముగా యూనివర్సిటీ వారు తనకు బి యే. డిగ్రీ యిస్తారనీ జ్ఞప్తికి వచ్చింది; అప్పటికి జరిగిన పరీక్షలన్నీ చాలా బాగా వ్రాశాడు. ఈ పరీక్ష కూడా బాగా వ్రాస్తే బహుశః యూనివర్సిటీలో ప్రథముడుగా పాస్యవచ్చును. ఈవిధంగా ఆలోచిస్తూ కూర్చున్నాడు రామం. ఇంతలో సుబ్బన్నగారు గదిలోకి వచ్చి "రామం! పరీక్షకు వేళవుతోంది. త్వరగా భోంచేసి వెళ్లు" అన్నాడు. అప్పటికప్పుడే తొమ్మిది గంటలైంది. వెంటనే లేచి భోంచేసి, కాలేజీ బట్టలు తొడుక్కొని, పెన్నులో సిరా పోసుకొని కాలేజీకి బయల్దేరాడు. వీధి అరుగు మెట్లు దిగి నాలుగడుగులు వేయగానే వెనుక నుంచి సుబ్బన్నగారు 'రామం! ఒక్క ఘడియ ఆగి వెళుదువుగాని కాని, వెనక్కు తిరిగిరా" అన్నాడు. సుబ్బన్నగారట్లా యెందుకంటున్నాడో రామానికి అర్థం కాలేదు. కాని యెదురుగుండా వస్తున్న గండు పిల్లిని చూసినప్పటికి బహుశః అదే కారణమై వుంటుందని మాత్రం ఊహించుకోగలిగాడు. అతనికి శకునాలంటే నమ్మకం లేకపోయినా పెద్దవాళ్లమాటలు తీసెయ్యలేక అప్పటికి మాత్రం వెనక్కు తిరిగివచ్చి మామయ్య చెప్పిన ప్రకారం కాళ్ళూ, చేతులూ కడుక్కొని గ్లాసుడు మంచినీళ్లు తాగి తిరిగి బయల్దేరి కాలేజీకి వెళ్లాడు.

కాలేజీకి చేరుకున్నప్పటికి తొమ్మిదిన్నరయింది. ఇంకా పరీక్షవేళకు అరగంట టైముంది. సాధారణంగా పరీక్షవేళకు కాలేజీకి వచ్చి తిన్నగా హాలులోనే కూర్చునేవాడు రామం. కాని అవ్వేళ యింటిదగ్గర మామయ్య తొందరచేయటం వల్ల పెందరాళే బయల్దేరి వచ్చేశాడు. ఈ అరగంటా యేంచెయ్యటానికి తోచక దగ్గరలోనే మఱ్ఱిచెట్టుకింద సమావేశమైన తోటి విద్యార్థుల దగ్గరకు వెళ్ళి కూర్చున్నాడు. అక్కడ కూడిన



వారంతా, యిదివరకల్లా శ్రద్ధచేసి చదువని విషయాలన్నిటినీ ఆ అరగంటలోనూ సాధ్యమైనంత వరకు ముఖ్యమైన వెలుకొన్న పరీక్షలో వ్రాసే వ్యాసాలనే తలంపుతో హడావిడిగా యేవేవో కంఠస్థము చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంతలో అక్కడివారిలో ఒకడు "ఇదిగో, యేకత్రోయ్, యీ 'ఫ్రూయర్ బాక్స్ థీరము' యిప్పటికి మూడు సంవత్సరాలనుంచీ అడగలేదు. ఈసారి తప్పకుండా అడుగుతాడు" అని పరీక్ష పేపరు వ్రాసివచ్చినవాడికైనా చెల్లనంతటి నమ్మకంతో వాదించసాగాడు. పాపం లాటరీ వేసి, దాని ప్రకారం యేవో కొన్ని విషయాలుమాత్రమే చదివిన మరొక విద్యార్థి యీ మాటలు విని, తను చదివినవాటిల్లో యీ "ఫ్రూయర్ బాక్స్ థీరమ్" లేకపోవటంచేత బేజారై రామం దగ్గరకు జరిగి "ఏమోయ్ రామం, ఈ థీరమ్ ఒకటి కాస్త చెబుదూ నీకెంతైనా పుణ్యం వుంటుంది" అని ప్రాధేయపడ్డాడు. పాపం రామం కూడా చేతనైన సహాయంచేద్దామని ఒక కాగితం తీసుకొని మొదట బొమ్మగీయటం ప్రారంభించాడు. వెంటనే అతనీ చుట్టూ పదిమంది మూగారు. బొమ్మగీసేవాణ్ణి సరిగ్గా గీయనీయకుండా తలొకదూ తలొక సలహా యివ్వడం ప్రారంభించేప్పటికి రామానికి సరైన యేకాగ్రత కుదరక బొమ్మ గీయటంలోనే తప్పుగీశాడు. దాంతో ఆ "థీరమ్" నాలుగుపేజీలు చేసినా నిరూపణ పూర్తవటం లేదు. రామానికేమీ తోచలేదు. ఎన్నిసార్లు తిరగేసినా తన తప్పు తనకు కనిపించటములేదు. పుస్తకం తిరగేశాడు. కాని ఆ కొద్ది టైములోనూ అందులోనూ తొక్కిన విద్యార్థుల గోలమధ్య, తను యెక్కడ పొరబడుతున్నదీ గుర్తించలేకపోయాడు. అదే సమయానికి మరొకవిద్యార్థి "ఫ్రూయర్ బాక్స్ థీరమ్ తప్పకుండా వస్తుంది" అని అరుస్తున్నాడు. ఆ మాటలు విని కొందరప్పుడే చిన్న చిన్న కాగితం ముక్కలమీద ఆ థీరాన్ని గబగబా కాపీ చేసేస్తున్నారు. రామం యెన్నిసార్లు ప్రయత్నించినా థీరమ్ నిరూపించలేకపోతున్నాడు.

"ఆ, ఎవడు చూడొచ్చాడు? ఇరవైమార్కుల ప్రశ్నను చూస్తూ యెవడొదులుకుంటాడూ?" అంటున్నాడొక విద్యార్థి.

ఇంకొకడు రామం దగ్గరకొచ్చి "ఇంక అట్టే శ్రమపడకండి అదెట్లాగూ జ్ఞాపకముండదు. ఇంకా పది నిమిషాలే టైముంది. వెంటనే ముఖ్యమైన స్టెప్సు కాగితపు ముక్కమీద వేసుకొని వెళ్ళండి" అని సలహా యిచ్చాడు. ఆ క్షణంలో రామానికి విచక్షణాజ్ఞానమే నశించిపోయింది. ఆ హడావిడిలో తనేం చేస్తున్నాడో కూడా మరచిపోయాడు ఒక కాగితంమీద ఆ థీరమ్‌లోని ముఖ్యాంశాలన్నిటినీ కాపీచేసి జేబులో పెట్టుకున్నాడు.

గంట గణగణ మ్రోగింది. అందరితోపాటు రామం తన సీటులో కూర్చున్నాడు. ప్రశ్నపత్రాలు పంచిపెట్టారు. ఆత్రతతో అన్ని ప్రశ్నలూ చదివాడు. అన్నీ అతనికి పూర్తిగా తెలిసినవే! నోటికి నూరుమార్కులు కూడా పొందగలగటములో ఆశ్చర్యమేమీ లేదు. ఇంత ఖంగారూ పెట్టిన "ఫ్రూయర్ బాక్స్ థీరమ్" అడగనేలేదు. అందుచేత జేబులో పెట్టుకొన్న కాగితం సంగతే మరచిపోయాడు రామం. నిజానికి ఆ కాగితం ముక్క సహాయముతో దొంగతనముగా సమాధానము కాపీ చెయ్యగలిగినంత ధైర్యముకూడా రామానికి లేదు.

సమాధానాలు వ్రాయటం ప్రారంభించాడు. ఇంతలో వెనుకనుంచి "ఏమోయ్ రామం, నూటికి నూరు మార్కులు వస్తాయా?" అని యెవరో పలుకరించారు. రామం వెనక్కు తిరిగి పలుకరించేది కాలేజీ ప్రిన్సిపాల్ అని తెలుసుకున్నాడు. సహజమైన అమాయకత్వంతో "తప్పకుండా వస్తాయండీ" అని సగర్వంగా చెప్పాడు. దాంతో ప్రిన్సిపాలు సంతోషిస్తూ వెళ్ళిపోయాడు.

## ఆనందవాణి పోస్టుబాక్సు నెంబరు

## 1583

చందాదారులు, వ్యాసకర్తలు, ఏజెంట్లు తాము ఆనందవాణికి వ్రాసే ఉత్తరాల చిరునామాలో పై నెంబరును తప్పక ఉదాహరించవలెను. లేనిచో మాకు ఆ జాబులు చేరడంలో ఆలస్యం జరగవచ్చు.

—మేనేజరు

"ఇంకొకడు నిముషాలే వుంది. త్వరగా రివైజ్ చేసుకోండి" అని అరుస్తున్నాడు వాచరు. సరిగ్గా అప్పటికి అన్ని ప్రశ్నలకూ సమాధానాలు పూర్తి చేయగలిగాడు రామం. నెత్తిమీదనుంచి పెద్ద భారం దింపినట్లయింది అతనికి. ఒక దీర్ఘ నిశ్వాసము విడచి, నుదుటిమీది చెమటను తుడుచుకునేందుకు జేబురుమాలు బైటికి తీశాడు. పేపరు పూర్తిచేయగలిగినందుకు తనలో తానే సంతోషిస్తూ, బి.యే. లో తప్పకుండా తానే యూనివర్సిటీలో మొదటివాడుగా ప్యాసవుతాడన్న ఆలోచనతో అన్సరు పేపర్లు వరుసగా పేర్చి దారం కడుతున్నాడు. ఇంతలో — వాచరు హఠాత్తుగా అతని దగ్గరకొచ్చి, నేలమీద పడివున్న కాగితపు ముక్కను తీసి, జాగ్రత్తగా అటూ యిటూ పరిశీలించి దానిని రామానికి చూపించి "ఈ కాగితంమీద యిదంతా వ్రాసింది నీవేనా?" అని గదమాయించాడు. ఆ కాగితం చూడగానే రామానికి ముచ్చెమటలు పోశాయి. అతను రుమాలు జేబులోంచి తీసినప్పుడు బయటపడి వుంటుందా కాగితం. దాన్నతడు గమనించలేదు. తిరిగి యిప్పుడా కాగితం చూడగానే పరీక్షకు ముందు తను చేసిన పనిలోని తప్పిదము స్ఫురించింది. కాని నిజాని కా కాగితంమీద యేమి వ్రాశాడో, యెందుకు వ్రాశాడో కూడా అతడు గుర్తించలేని పరిస్థితులలో ఆ పని చేశాడు. దుష్ప్రవర్తనతో నిండిన బలమైన వాతావరణమునుండి విచక్షణా జ్ఞానము నశించి, కాగితంమీద యేదో వ్రాసి తన జేబులో నుంచుకొన్నాడు. తను చేసినపనియొక్క యోగ్యతా యోగ్యతలు గుర్తించుటకు పూర్వమే దాని సంగతి మరచిపోయి, సమాధానములు వ్రాయుటలో పడిపోయాడు. ఇప్పుడు వాచరు చూపించిన కాగితం ముక్క చూడగానే, తానేమి చేసిందీ రామానికి బోధపడింది. కాని తను చేసింది —ఒకానొక క్షణములో, పరిసర వాతావరణమునకు లొంగిపోయి, తన మనస్సును చిక్కబట్టుకోలేకపోయినవాడనే నేరమే కాని, మరే యితర నేరమూ కాదని అతడు గుర్తించాడు. కాని ఆ విధమైన వాదమును నమ్మేదెవరు?

తిరిగి వాచరు "ఈ కాగితం నీ జేబులోనుంచే క్రిందపడిందా?" అని అడిగాడు.

"అవును."

"అయితే దీన్ని కాపీచెయ్యటానికే నీ జేబులో నుంచుకొన్నావా?"

దాన్నెందుకు జేబులో వుంచుకొన్నాడో అతనికే అర్థమవటంలేదు. అటువంటి పరిస్థితిలో యేం సమాధానం యిస్తాడు. రామం మౌనాన్ని వేరువిధంగా అర్థం చేసుకొని అతని అన్సరు పేపరు మీద "దుష్ప్రవర్తన" అని వ్రాశాడు వాచరు. ఇంతలో ప్రిన్సిపాలు, యితర లెక్చరర్లూ రామం చుట్టూ మూగారు.

"ఈ కాగితాన్నెందుకు జేబులో వుంచుకొన్నావు?" ఎవరడిగినా యిదే ప్రశ్న.

అందరూ పలువిధాలుగా మాట్లాడుతున్నారు.

"యూనివర్సిటీ ఫస్టు రావాలని యిటువంటి పెద్దపనులు చేస్తారా. యూనివర్సిటీనుంచి ఇటువంటివాళ్ళను బహిష్కరించాల్సిందే!"

"ఇట్లాగే సంపాదించాడేమో కప్పులూ, మెడల్సూ కూడా."

"ఎన్నాళ్ళని తప్పించుకోగలడండీ"

"ఇంకో రెండు నిమిషాలు గడిచిపోతే యీసారి కూడా తప్పించుకునేవాడే!"

రామం చెవుల్లోకి యితర ధ్వనులతోపాటు, యీ ధ్వనులు కూడా ప్రవేశిస్తున్నాయి. తన ప్రవర్తనను తానే నమ్మలేని పరిస్థితిలో వున్నాడతను. కాని కాగితంమీద ధీరమ్ వ్రాసింది తనేనని, దాన్ని జేబులో పెట్టుకున్నదీ తనేనని ఒప్పుకున్నాడు. ఈ ప్రవర్తనకు అతడెంతవరకు బాధ్యుడు; యిటువంటి పని అతడే వుద్దేశ్యంతో చేసివుంటాడు అనే విషయం నిర్ణయించవలసింది యూనివర్సిటీ అధికారులు.

రోజులు గడచిపోయాయి. విశ్వవిద్యాలయాధికారులు రామం యే చదువుకీ అనర్హుడని తీర్మానించి అతనికి తెలియజేశారు. చదువే తన సర్వస్వమూ అనుకొన్న రామానికి యింతకాలమూ చదివిన చదువుకి ప్రతిఫలము లేకపోగా, ఒక క్షణపు మనోదుర్బలత్వమునకు ఫలితముగా, అతడసలు చదువుకే అనర్హుడని తీర్మానింపబడింది.

ఈ విషయము వెల్లడైన నాలుగవరోజున రామం నిర్జీవశరీరం ఊరిబయటి చెరువులో తేలుతూ వుండగా చూసి, ఆ చుట్టుపక్కలవారు కొందరు దానిని బయటకు తీశారు. ఇంకా ప్రాణంతో వున్నాడేమో క్రిమినల్ చట్టప్రకారం ఆత్మహత్యా ప్రయత్నం నేరం క్రింద కేసు రిజిష్టరు చేయవచ్చునని, శవాన్ని పరీక్షిస్తున్నాడు పోలీసు అధికారి.

---

అనగద కాశే *